మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# తాలుపేరిట ధాన్యంలో కోతలొద్దు

**48గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ**

**ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**చిన్నచింతకుంట, నవంబరు 03 ప్రభాతవార్త :** గత ప్రభుత్వం మాదిరిగా తాలు పేరిట ధాన్యంలో కోతలు పెట్టవద్దని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. మండలంలోని దమగ్నపూర్, పర్దీపూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆదివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొను గోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో పడతాయన్నారు. ఈ సీజన్ నుండే సన్న వడ్లకు రూ. 500ల బోనస్ ఇస్తామని, ఏ వన్ గ్రేడ్ క్వింటా కు రూ.2320 మద్దతు ధరగా ఉంటుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయమన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల నుండి తాలు, తరుగు పేరిట 5 నుండి 6 కిలోల ధాన్యా న్ని రైతుల నుండి దోచుకునేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, రైతుల బాధలు తెలిసిన ప్రభుత్వమని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, గన్ని బ్యాగులు అవసరం ఉంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సి న అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్ర మంలో అప్పంపల్లి ముచ్చింతల సింగిల్ విండో ఛైర్మన్‌లు ఉమామహేశ్వర్‌రెడ్డి, సురెందర్‌రెడ్డి, డైరెక్టర్ అనిల్‌రెడ్డి, నాయకులు, పార్టీ మండల అధ్యక్షులు నరెందర్‌రెడ్డి, ఎస్. వెంకటేష్, వట్టెం శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, తెలుగు వెంకటేష్, ఎద్దుల మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పశువుల దొంగల ముఠా అరెస్ట్

- పశువులు,బొలేరో వాహనం స్వాధీనం
- ఐదుగురిపై కేసు నమోదు : డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీవెంకటేశ్వర్లు

**దేవరకద్ర, నవంబరు 03 ప్రభాతవార్త:** దేవరకద్రలో పశువుల దొంగల ముఠాను పోలీసులు పట్టుకొన్నారు. దేవరకద్ర పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ రామకృష్ణ, ఎస్ఐ నాగన్నలతో కలసి డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. ఈ నెల 2న సాయంత్రం ఎస్ఐ నాగన్న తన సిబ్బందితో కలసి అమ్మాపూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండ గా రాయచూర్ వైపు వెళ్తున్న బొలేరో వాహనంలో రెండు ఎద్దులను తీసుకెళ్తున్న విషయాన్ని గమనించి వివరాలు అడుగుతుండగానే వాహనంలో ఉన్న ఐదుగురు పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. దీంతో వారిని పట్టుకొని విచారించగా తాడూర్ మండలం మంగపల్లి గ్రామం నుంచి గత నెల 28న దొంగతనం చేసిన రెండు ఎద్దులను తీసుకొని వాటిని విక్రయించడానికి రాయచూర్‌కు వెళ్తున్నామని పోలీసులకు తెలిపారు. గత నెల 25న బల్సుపల్లి శివారులో కట్టేసిన రెండు బర్రెలు, 2 దూడలను, సెప్టెంబరు 13న గుమ్మకొండలో బర్రెను దొంగలించి లింగాల గ్రామంలోని సాంభశివుడు అనే వ్యక్తి వద్ద ఉంచినట్లు చెప్పారు. అలాగే లింగాల గ్రామానికి వెళ్లి మూడు బర్రెలు, 2 దూడలను స్వాధీనం చేసుకొన్నారు. పట్టుబడ్డ పశువుల విలువ సుమారు రూ.2లక్షల80 వేల వరకు ఉంటుందని డిఎస్పీ తెలిపారు. దొంగతనాలకు పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులు దేవరకద్ర, తాడూర్, తిమ్మాజిపేటలతో పాటు జడ్చర్ల, కల్వకుర్తి, భూత్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడ పశువుల దొంగతనాలకు పాల్పడ్డారని డిఎస్పీ తెలిపారు. పశువుల దొంగల ముఠాను పట్టుకొన్న దేవరకద్ర పోలీసులను డిఎస్పీ అభినందించారు.

# హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన

**తొలిసారి వెయ్యి మంది భక్తులతో చాలీసా పారాయణం**



హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం

**భూత్పూర్, నవంబరు 03, ప్రభాతవార్త:** పాలమూరు స్వరలహరి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్ సమీపంలోని వాసవీ గార్డెన్‌లో వెయ్యి మంది భక్తులతో ముక్తకంఠంతో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో సాంప్రదాయ దుస్తులతో భక్తులు, కల్చరల్ అకాడమీ చిన్నారుల వేషధారణలు అలరించాయి. కార్యక్రమంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఎపి జితేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, స్వరలహరి కల్చరల్ అకాడెమి జిల్లా అధ్యక్షుడు భాగన్నగౌడ్, ప్రధాన వక్తగా పల్లెర్ల రాంమ్మోహన్‌రావు, మద్ది అనంతరెడ్డితో పాటు న్యాయవాదులు మనోహర్‌రెడ్డి,బుర్రి వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంత్, తిరుమల వెంకటేష్, యాదగిరి, లక్ష్మణ్‌నాయక్‌తో పాటు స్వరలహరి కల్చరల్ అకాడమీ లీగల్ అడ్వయిజర్ పల్లెర్ల వెంకటేశ్వర్‌రావు, భూత్పూర్ ఆంజనేయస్వామి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# హంస వాహనంపై గోవిందుడు

**కనుల పండువగా కురుమూర్తి బ్రహ్మోత్సవాలు**

**చిన్నచింతకుంట, నవంబరు 03 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత గోవిందుడు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ప్రధానాలయంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ కురుమతిస్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన పల్లకిలో ఉంచి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అల్లిపూర్ దాసులు స్వామి ప్రధాన ఆలయం నుంచి కొండపై గల ముఖద్వారం వరకు స్వామివారు హంస వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో కాంచన గుహ పులకరించింది. కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ గౌని గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, మాజీ దేవస్థాన ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, విండో ఛైర్మన్ సురెందర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

# ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**పాల్గొన్న మాజీ ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, చించోడ్ అభిమన్యురెడ్డి**

**నవాబ్‌పేట, నవంబరు 03 ప్రభాతవార్త :** నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల గ్రామ పంచాయతీలోని తుక్యాతండాలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. భూమి పూజలో మాజీ ఎంపి మన్నె శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమ న్యురెడ్డి, మాజీ జడ్పీటిసి ముత్యాల రవిందర్‌రెడ్డి, నవాబ్‌పేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాడేమోని నర్సింహులు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ మండల నాయకులు, యూత్‌వింగ్ నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, యువనేత అభిమన్యురెడ్డి

# బీటెక్ కల సాకారం






- ఇక పీయూలో ఇంజినీరింగ్, లా కాలేజీ
- దశాబ్దాల కలకు కార్యరూపం
- ఫలించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషి
- రూ.68కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల ఏటీసీగా అప్‌గ్రేడ్
- పాలమూరులో విద్యాభివృద్ధికి అడుగులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 3, ప్రభాతవార్త :** పాలమూరు ఇక ఎడ్యుకేషనల్ హబ్‌గా మారునున్నది. ఏండ్లుగా కలగానే మిగిలిన ఇంజినీరింగ్ విద్య పాలమూరు బిడ్డలకు అందనున్నది. పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, లా కళాశాలలకు ఇటీవలే రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విద్యాభివృద్ధికి కంకణబద్దులై నిరంతరంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఎంసెట్, నీట్ విద్యార్థులకు సొంత నిధులతో ఉచిత కోచింగ్ అందజేశారు. ఇటీవలే పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ఏటీసీగా మార్చారు. తాజాగా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, లా కళాశాల ఏర్పాటుకు తానే ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని మంజూరయ్యేలా కృషి చేశారు. వచ్చే ఏడాది నుంచే తరగతులు కూడా ప్రారంభం కానుండడంతో పాలమూరు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఎమ్మెల్యే యెన్నం పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ పుస్తకాలు పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ పుస్తకాలు అందజేయడంతో పాఠ్యాంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలగడంతో పరీక్షల్లోనూ అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించారు.
- ఆగస్టులో ఎంసెట్, నీట్ విద్యార్థులకు ఎమ్మెల్యే యెన్నం తన సొంత నిధులతో ఎంట్రెన్స్ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించారు. మహబూబ్‌నగర్ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో 200మంది విద్యార్థులకు శిక్షణ అందించారు.
- ఇటీవలే మహబూబ్‌నగర్ పాలిటెక్నిక్ కళాశాలను రూ.68కోట్లతో ఏటీసీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులకు సాంకేతిక శిక్షణ అందించి కొత్త కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు.
- పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాల, లా కళాశాల ఏర్పాటు విశయంలోనూ ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డిని, ఉన్నతవిద్యామండలి ఛైర్మన్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసి పాలమూరు యూనివర్సిటిలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ఆవశ్యకతను వివరించి ఒప్పించారు. అయితే తెలంగాణలోని ఆరు యూనివర్సిటిల్లో కేవలం కాకతీయ, ఉస్మానియా, జేఎన్‌టీయే విశ్వవిద్యాలయాల్లో మాత్రమే ఇంజినీరింగ్ కళాశాల ఉంది. ఇక పీయూలో కూడా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కానున్నది. వచ్చే యేడాది తరగతులు కూడా ప్రారంభం కానుండడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే బాటలు..

మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. తన సొంత డబ్బులతో పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ, పుస్తకాలు అందజేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తొలిరోజు నుంచే తనను కలిచేందుకు వచ్చే వారు బొకేలు, పూలదండలు, ఇతర గిఫ్ట్‌లు తీసుకురావొద్దని, పుస్తకాలు, పెన్నులు అందజేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా చాలా వరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పుస్తకాలు, పెన్నులు జమ కావడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అందజేస్తూ వచ్చారు. ఇప్పటికే మూడు దఫాలుగా పుస్తకాలు అందజేసి పేద విద్యార్థులకు ఎంతో మేలు చేశారని చెప్పవచ్చు.



## విద్యాభివృద్ధే లక్ష్యం..

పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. పీయూలో ఇంజినీరింగ్,లా కళాశాల ఏర్పాటుకు ఎంతో కృషి చేశాం. ఫైలును స్వయంగా నేనే పలుమార్లు తీసుకెళ్లా. వచ్చే యేడాది నుంచే తరగతులు ప్రారంభం అవుతాయి. అతి త్వరలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కళాశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం. సీఎంతో మాకున్న పరిచయం, జిల్లాతో ఆయనుకున్న అనుబంధం వల్ల యూనివర్సిటీకి రూ.100కోట్ల ఫండ్ వచ్చింది. దక్షణభారతదేశంలో కేవలం రెండు యూన్సివర్సిటీలకే రూ.100కోట్ల ఫండ్ వచ్చింది. గత ప్రభుత్వం జేఎన్‌టీయూ యూనివర్సిటీ తెచ్చామని ప్రచారాలు చేశారు. యూనివర్సిటీ, విద్యార్థులు, కోర్సులు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. ఉన్నత చదవులు చదివిన నేతగా విద్యా వ్యవస్థపై పూర్తి అవగాహన ఉన్నది. పాలమూరును విద్యాహబ్‌గా మారుస్తాం.

**- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శాసనసభ్యుడు, మహబూబ్‌నగర్**

# వైఫల్యాలను ఎండగట్టేందుకు భరోసా యాత్ర

- డిసెంబర్ 7న నిరసన దీక్ష..
- పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి
- మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత డాక్టర్ నాగం జనార్ధన్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాగం జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 03 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 11నెలలు గడుస్తున్నా అసమర్ధపాలన వల్ల అభివృద్ధి శూన్యంగా మారిందని ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో భరోసాయాత్ర చేపడుతానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాలనలో పూర్తిగా వైఫల్యం చెందడం వల్ల మంత్రులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కు కావడం వల్ల ఇష్టారాజ్యంగా వ్యహరిస్తున్నారని, పెండింగ్ ప్రాజెక్టును పూర్తి చేయడంలో ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టును పూర్తి చేయ డంతో పాటు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని 3వ ప్యాకేజీ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయకపోతే డిసెంబర్ 7న చేపడుతానన్న నిరసన దీక్ష యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు. కాల్వల సామర్థ్యాన్ని పెంచి రిజర్వాయర్లను పూర్తి చేస్తే భూగర్భజలాలు కూడా పెరిగే అవకాశం ఉందని వివరించారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిచేయాలని మంత్రులు పేర్కొన్నారని మరి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పార్టీకి చెందిన ముఖ్య నేతలు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నీట మునిగిన మోటార్లను ఎందుకు పట్టించుకోవడం లేదని, బురదలో ఇరుకున్న మోటార్లను నీటితో కడిగారే తప్ప వాటిని మరమ్మతులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. 6 గ్యారెంటీల్లో మహిళలకు ఇచ్చిన రూ.2500 పంపిణీ ఏమైందని, రైతు భరోసా ఎటు పోయిందని, ఇందిరమ్మ ఇండ్లు, భూ పంపిణీ ఇండ్ల స్థలాల పంపిణీ, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు గాలికి వదిలేశారు. రాహుల్‌గాంధీ రాష్ట్ర పర్యటన సందర్భంగా మంత్రివర్గ విస్తరణపై నీతివంతమైన పాలన అందించడంపై పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపై రైతు భరోసాపై పెన్షన్లను పెంచడంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అర్ధం రవి, బాలగౌడ్, లక్ష్మయ్య, అహ్మెద్, సత్యం, వెంకటేష్, వెంకటస్వామి, అర్జునయ్య, సుబ్బయ్య, విష్ణులతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రైతు పక్షపాతిగా ప్రభుత్వం

**కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ**



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అచ్చంపేట, నవంబరు 03 ప్రభాతవార్త:** రైతన్న మేలు, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రుణమాఫీ, పెట్టుబడి సహాయం క్రింద ఎక రానికి రూ.6వేలను అందిస్తూ పంట నష్ట పరిహారం అందిస్తూ రైతు పక్ష పాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మి వెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణఓ కలిసి రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాన్ని గుర్తించే రాష్ట్ర ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తుం దని, తేమ శాతం ద్వారా గిట్టుబాటు ధరను కల్పిస్తూ కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్న అభివృద్ధే ధ్యేయం గా ముందుకు సాగుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంట వివరాలను సేకరించి అచ్చంపేట నియోజకవర్గంలో పంటనష్టపోయిన రైతులకు నష్ట పరిహారం కింద రూ.9.33కోట్లను రైతు ఖాతాల్లో జమ చేసిందని గుర్తుచేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. పంట సాగు చేసే సమయం నుంచి విక్రయించే వరకు చేసిన కష్టానికి ప్రతిఫలం దక్కే విధంగా రైతన్నకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులుగా నియమితులైన కేవీఎన్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అంతకు ముందు జిన్నింగ్ మిల్లు ఆవరణలో మొక్కలు నాటి నీరుపోశారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు పండిత్‌రావు, మండల ప్రచార కమిటీ ఛైర్మన్ పాండురంగారెడ్డి, లక్ష్మి వెంకటేశ్వర మిల్లు నిర్వాహకులు లాలుయాదవ్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శేఖర్, హేమారెడ్డి, అధికారులు శ్రీధర్, ప్రవీణ్ ఉన్నారు.



# హామీలు ఎటుపాయే ?

- ఏడాది కావస్తున్న ఒక్కటీ అమలుకు నోచుకోలేదు
- 11నెలల్లో 50వేల ఉద్యోగాలు బోగస్
- ఎంపి డికె అరుణ ఫైర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 03 ప్రభాతవార్త :** సోనియాగాంధి పుట్టినరోజే అన్ని హామీలు అమలు చేస్తామన్నారు. ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ విమర్శించారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్క ఇల్లు మొదలు పెట్టలేదని అసలు కేంద్రం నిధులు లేకుండా వీళ్ల ఇళ్ల కడతారా? అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ కాలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో డికె శివకుమార్ ఫ్రీ బస్ ఎత్తేస్తాం అంటున్నారని పేర్కొన్నారు. గ్రామాలకు బస్సులు బంద్ చేసి ఫ్రీ బస్ అంటున్నారని ఇదెక్కడి పద్ధతి అని విమర్శించారు. రూ.500లకే సిలిండర్‌లో కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రూ.375, మరి మీరిచ్చేది ఎంత? ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు అన్ని కేంద్రానివే కదా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందేంటో చెప్పాలన్నారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను భ్రమలో ఉంచుతున్నారని, ప్రజలు అన్ని అర్థం చేసుకుంటారని చెప్పారు. రైతు భరోసా లేదు, కౌలు రైతులకు, కూలీలకు సాయం దిక్కులేదు.. కాలేజీ చదివే అమ్మాయిలకు స్కూటీలు ఎటు పాయే అని, 11నెలల్లో 50 వేల ఉద్యోగాల భర్తీ మాట పెద్ద బోగస్ అని చెప్పారు. రాజీవ్ ఆరోగ్య బీమా పేరిట రూ. 10 లక్షల వైద్యం ఈ పది నెలల్లో ఎంత మందికి, ఎక్కడెక్కడ చేయించారో బయట పెట్టండని ఆ వివరాలు ప్రజలకు మీడియాకు తెలియపరచాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఒక పింఛన్ దరఖాస్తు కూడా తీసుకోలేదని, కొత్త వితంతు పింఛన్లు రాక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి పాలనపై దృష్టి సారించాలని విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

# చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

**ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు**



**మహబూబ్‌నగర్, నవంబరు 03 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు పార్కులో ఆడుఉంటున్న మూడేళ్ల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహబూబ్‌నగర్ రూరల్ సిఐ గాంధీనాయక్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డు వద్ద ఉన్న పిస్తా హౌస్‌లో పని చేస్తున్న రిజ్వాన్ అనే వ్యక్తి పార్కులో ఆడుకుంటున్న చిన్నారిని పక్కకు తీసుకెళ్లి అత్యాచార యత్నం చేస్తుండగా గమనించిన స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వెంటనే యాజమాన్యం పోలీసులకు ఫోన్ చేయడంతో రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఉదయం జరిగినట్లు సమాచారం. ఈ మేరకు రూరల్ సిఐ గాంధినాయక్‌ను వివరణ కోరగా నిందితుడిపై ఫోక్సో యాక్ట్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మన్యంకొండలో కార్తీకమాసం పూజలు ప్రారంభం

### ఆలయశిఖరంపై వెలిగిన ఆకాశదీపం



దేవస్థానంపై వెలుగుతున్న ఆకాశదీపం

**దేవరకద్ర,నవంబరు 03 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి కార్తీకమాసం పూజలు ప్రారంభమయ్యాయి.ప్రతి ఏడాది దేవ స్థానంలో కార్తీక మాసం పూజలను నెల రోజులపాటు అత్యంత ఘనంగా నిర్వహించడం సాంప్ర దాయంగా వస్తుంది.అందులో బాగంగానే ఈ ఏడాది కూడ కార్తీకమాసం పూజలను ప్రారంభిం చారు.ఈ సందర్భంగా దేవస్థానం ప్రధాన శిఖరంపై పవిత్ర ఆకాశదీపాన్ని ఏర్పాటు చేశారు.కార్తీక మాసం ముగింపు రోజు ఈ దీపాన్ని దించుతారు.ఈ ఆకాశదీపం పూజా కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధుల భారీ నుండి కాపాడండి..

**ఆత్మకూరు నవంబరు 03 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని బాలకిష్టాపూర్ గ్రామ సమీపంలో నిర్వహిస్తున్నటువంటి కస్తూర్బా బాలికల పాఠశాల నుండి ప్రాతినిత్యం మురుగునీరు బయటకు వదలడంతో బాలకృష్టాపూర్ గ్రామంలోని పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు నెలల నుండి మురుగునీరు నుండి కాపాడాలంటూ గ్రామ కార్యదర్శికి ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నటికి పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కస్తూర్బా పాఠశాల నుండి మురుగునీరు బయటకు వెదజల్ల డంతో కాలనీలోని పలు ఇళ్లల్లోకి కూడా మురుగనీరు చేరి దుర్గంధ భరితంగా తయారవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. మురుగునీరు వెదజల్లుతుండడంతో అంటువ్యాధుల బారిన పడి ప్రతినిత్యం ఆసుపత్రులు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని గ్రామానికి చెందిన పలువురు యువకులు విచారణ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ కార్యదర్శి గాని లేదా ప్రభుత్వ ఉన్నతాధికారులు గాని స్పందించి కస్తూర్బా పాఠశాల నుండి వెలువడుతున్నటువంటి మురుగు నీటిని ఆరికట్టి అంటువ్యాధుల భారీ నుండి రక్షించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కస్తూర్బా పాఠశాల నుండి విడుదలవుతున్న మురుగునీరు దృశ్యం

## నూతన ఉపాధ్యాయులకు సన్మానం..

**గద్వాల,నవంబరు 3 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ కార్యాలయంలో ఆదివారం రోజు ఉదయం గ్రంథాలయంలో చదువుకుని ఉపాధ్యాయ పోస్టులు సాధించిన వారిని శాలువా మెమొంటోతో చైర్మన్ శ్రీనివాసులు సన్మానించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు ఈ సందర్భంగా మాట్లాడుతూ వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని ఉన్నత స్థానాలలో కొనసాగాలన్నారు. మంచి, మంచి ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. గ్రంథాలయంలో అవసరమైన కాంపిటేటీవ్ బుక్స్‌ను ఏర్పాటు చేస్తానని, మంచిగా చదువుకుని ఉన్నత స్థానిలో ఉండాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ పోస్టులు సాధించిన అందరూ గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు కు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు సాతర్ల మాజీ సర్పంచు జయచంద్రారెడ్డి, ప్రభాకర్, గ్రంథాలయ కార్యదర్శి శ్యాంసుందర్, గ్రంథపాలకుడు రామాంజనేయులు, సిబ్బంది శ్రీకాంత్, గోపాల్, సికిందర్, భాషా తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగాలు పొందిన వారికి సన్మానం చేసిన చైర్మన్ నీలి శ్రీనివాసులు

## వైభవంగా గంగమ్మ పాముకాటు జాతర

**వీపనగండ్ల నవంబరు 03 ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల కేంద్రంలో ఆదివారం నాడు గంగమ్మ పాముకాటు జాతర వైభవంగా జరిగింది. భక్తుల కనుసన్నలలో గంగమ్మ దేవతకు గణేష్ 28 సంవత్స రాల యువకుడు శిగం ఊగుతూ దేవత కనుసన్నలలో భక్తులకు దర్శనం ఇచ్చాడు అయితే దీపావళి పండుగ సందర్బాన్ని పురస్కరించుకొని వీపనగండ్ల మండల కేంద్రంలో ప్రతి సంవ త్సరం గంగమ్మ పాము కాటు జాతర వైభవంగా జరుగుతుంది. కార్తీక మాసం అమావాస్య రోజు నోములు నోముకొని దేవతకు పూజలు నిర్వహించి మూడు రోజుల తర్వాత జాతరకు శుద్దుల వాళ్లు బైండ్లు వారు కథలు గంగమ్మ పుట్టి పెరిగిన విషయాలను అన్నింటినీ కథల రూపేనా సుద్దుల వాళ్ళు చెప్తా రు. ఈ సందర్భంగా పూనకంతో శిగసత్తులు పెద్ద ఎత్తున శిగాలు ఊగుతూ కేకలు వేస్తూ ముందు కు సాగుతూ ఉండడంతో జాతర మొదలవుతుంది దీన్ని తీర్థ ఘటం అని వారి భాషలో చెప్తారు. ఈ తీర్థఘటం సందర్భంగా దేవత విగ్రహాలని మంచినీటి కొలను తీసుకుపోయి శుద్ధి చేసి మళ్లీ తీసుకువచ్చి యధా స్థానంలో నిర్వాహకులు ఇలవేల్పు అయినటువంటి గంగమ్మ దేవత అయ్యన్న కుటుంబ సభ్యులు చేరుస్తారు. ఈ రకంగా ఆదివారం రోజు జాతర పెద్ద ఎత్తున జరగడంతో పాటు భక్తులు ఈ జాతర చూడటానికి వివిధ గ్రామల నుండి పెద్ద ఎత్తున తరలివస్తారు. ఈ జాతర మూడవరోజు గుడిలో నుండి దేవతను బయటకు తీసిన తర్వాత ముగుస్తుంది.



గంగమ్మ దేవతకు శిగం ఊగుతున్న భక్తుడు గణేష్

## గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి...

### -సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు

**కల్వకుర్తి, నవంబరు 03 ప్రభాతవార్త:** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కల్వకుర్తి కమిటీ సమావేశాన్ని కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పటికి కార్మికుల కష్టాలు మారలేదని, నెలల తరబడి వేతనాలు బకాయిలు ఉంటున్నాయన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 4 నెలలుగా కార్మికులకు జీతాలు రాలేదని, ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టం చేసి జీతాలు రాక అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సి న దుస్థితి ఏర్పడిందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను ఏ ప్రభుత్వాలు వచ్చిన అమలు చేయడం లేదని, అదే విధంగా మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించి వారికి కనీస వేతనాలు అమలు చేయాలని, అదే విధంగా వారికి సంవత్సరానికి రెండు జతల బట్టలు, సబ్బులు, నూనెలు, గ్లౌజులు మాస్కులు ఇవ్వాలన్నారు. ఇదే డిమాండ్‌తో ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు కార్డులను కార్మికులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మహేష్, శంకర్, ఉపాధ్యక్షులు అర్జున్, లక్ష్మమ్మ, కృష్ణమ్మ, మంజుల, బాలమ్మ, శ్రీనివాసులు, పరుశరాములు, కృష్ణయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.



గుర్తింపు కార్డులను కార్మికులకు అందజేస్తున్న దృశ్యం

# తిరుచ్చివాహనంపై ఊరేగిన వెంకటేశ్వరస్వామివారు..

### - అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి దర్శనం

**దేవరకద్ర,నవంబరు 03 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను ధక్షిణకట్ట వరకు నిర్వహించారు. అక్కడ కూడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చంణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.



మన్యంకొండలో స్వామివారికి హారతి ఇస్తున్న మధుసూధన్‌కుమార్

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్బంగా స్వామి వారు తిరుచ్చి సేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్బంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారు

## క్రీడలలో గెలుపు ఓటములు సహజం..

**వీపనగండ్ల నవంబరు 03 ప్రభాతవార్త :** క్రీడలలో గెలుపు ఓటములు సహజం అని క్రీడా నిర్వాహకులు టిఆర్ఎస్ నాయకులు ముంత మల్లయ్య యాదవ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్ మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య యాదవ్ అన్నారు. దీపావళి గంగమ్మ జాతర సందర్భంగా మండల కేంద్రంలోని జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లా సాతాపూర్ కబడ్డీ జట్టు మొదటి బహుమతిని కైవసం చేసుకోగా, రెండవ బహుమతిని వీపనగండ్ల మండలంలోని పుల్గర్ చర్ల కబడ్డీ జట్టు కైవసం చేసుకుంది. మూడు రోజులపాటు హోరాహోరీగా జరిగిన కబడ్డీ పోటీలలో మొత్తం 40 జట్లు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలలో సాతాపూర్ పుల్గర్ చర్ల జట్లు తలపడగా సుమారు 20పాయింట్లతో సాతాపూర్ జట్టు విజయం సాధించి మొదటి బహుమతిగా 15000 రూపాయల నగదు షీల్డ్ ను అందుకున్నారు. రెండో బహుమతి పుల్గర్ చర్ల జట్టుకు పదివేల రూపాయల నగదు,షీల్డ్ మూడో బహుమతి నాగర్‌కర్నూల్ జట్టుకు ఐదువేల రూపాయల నగదు షీల్డ్ ను గెలుపొందిన జట్లకు మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముంత మల్లయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, గ్రామ రైతు కమిటీ అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ముంత కృష్ణయ్య యాదవ్, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు శివ యాదవులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పళ్ళ నరేందర్ రెడ్డి మహేష్ నాయుడు తదితరులు ఉన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

## దేవాలయాల అభివృద్ధికి చేయూతనివ్వండి

### టిటిడి చైర్మన్ కు కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి...

**ఆత్మకూరు నవంబరు 03 ప్రభాతవార్త :** మఖ్తల్ నియోజకవర్గం పరిధిలోని తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన దేవాలయాల అభివృద్ధికి చేయూతనివ్వాల్సిందిగా మొత్తం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ఆత్మకూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పరమేష్ మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు తదితరులు ఆదివారం రోజు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు ను కలిసి విజ్ఞప్తి చేశారు. మఖ్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు హైదరాబాదులోని టిటిడి చైర్మన్ కార్యాలయంలో కలిసి దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరినట్లుగా వారు తెలిపారు. ముఖ్యంగా ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన దాదాపు 40ఎకరాలకు పై బడి ఉన్న నేపథ్యంలో టిటిడి ఆధ్వర్యంలో దేవాలయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేసినట్టుగా తెలిపారు. అంతేకాకుండా మొత్తం నియోజకవర్గంలోని పలు గ్రామాలలో టిటిడి బోర్డుకు సంబంధించిన దేవాలయాల భూములలో ప్రత్యేక దేవాలయాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడంతో అందుకు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకునేందుకు పూర్తి సహకారం అందించి చర్యలు తీసుకునేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్లుగా టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపినట్లుగా వారు పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ను ప్రత్యేక శాలువాతో సత్కరించినట్లుగా తెలిపారు.



టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును సన్మానిస్తున్న మఖ్తల్ కాంగ్రెస్ నాయకులు

## మా స్కూల్‌కు ఉపాధ్యాయులను కేటాయించండి..

### అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్‌పర్సన్ నర్మద

**ఉప్పునుంతల,నవంబరు 03 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జీవశాస్త్ర హిందీ ఉపాధ్యాయులను కేటాయించాలని పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్ పర్సన్ నర్మద జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. ఉప్పునుంతల మండల కేంద్రంలోని విద్యార్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి ఎంతోమంది విద్యార్థులు వచ్చి ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారని ఆమె వివరించారు. ప్రస్తుతం 250 మందికి పైగా విద్యార్థులు ఉన్నత పాఠశాలలో చదువుతున్నారని ఆమె తెలిపారు. రెండు మీడియాలలో బోధన జరుగుతుందని ఆమె వివరించారు. రెండు మీడియాలకు కలిపి జీవశాస్త్ర, హిందీ ఉపాధ్యాయులు ఒక్కొక్కరే ఉండడంతో బోధనలో ఎంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. గత ఏడాది 10వ తరగతి వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలను సాధించినట్లు ఆమె తెలిపారు. మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు జీవశాస్త్రం, హిందీ అదనపు ఉపాధ్యాయులు అవసరం ఉందని ఆమె తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిషత్ ఉన్నత పాఠశాలకు కేటాయించాలని ఆమె కోరారు.మా స్కూల్‌కు జీవశాస్త్రం, హిందీ ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వెంటనే అచ్చంపేట ఎమ్మెల్యే స్పందించి జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి తమ పిల్లలకు న్యాయం చేయాలని పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఏకరువు పెట్టుకుంటున్నారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 257 మంది విద్యార్థులు చదువుతున్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో చదివే విద్యార్థులకు జీవశాస్త్రం, హిందీ సింగిల్ టీచర్లు బోధిస్తున్నారు. బోధన, మూల్యాంకనం తదితర అంశాలలో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని మరో ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి విన్నవించుకున్నారు.



జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి

## తహశీల్దార్ పై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి ఎమ్మార్పీఎస్ డిమాండ్...

**ఆత్మకూరు నవంబరు 03 ప్రభాతవార్త :** గద్వాల జిల్లాలోని ఇటక్యాల మండలానికి చెందిన ప్రభాకర్ రెడ్డి తహశీల్దార్ నరేంద్ర పై దాడి చేసిన విషయాన్ని తీవ్రంగా పరిగణించి తక్షణమే అరెస్టు చేయాలని వనపర్తి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మధ్యపాక లక్ష్మణ్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బాబు జగ్జీవన్ రామ్ సంఘం నాయకులు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ప్రజలకు సేవ చేసే అధికారులపై దౌర్జన్యం ప్రదర్శిస్తూ దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఇటిక్యాల మండలంలోని మల్కాపూర్ గ్రామ వర్కర్ ను బదిలీ చేయాలంటూ మండలానికి చెందిన ప్రభాకర్ రెడ్డి ఇటిక్యాల తహశీల్దార్ నరేందర్ పై అకారణంగా దాడి చేసి తీవ్రంగా దుర్భాషలాడుతూ అవమానం పాలు చేశాడని ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు చర్యలు చేపట్టపోవడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. దళిత ఎమ్మార్వో పై దాడి చేసిన నాయకులను అరెస్టు చేయాలంటూ శనివారం రోజు గద్వాల జిల్లా కలెక్టర్ కలిసి విజ్ఞాపన పత్రం అందజేసినప్పటికి దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా కాలయపన చేస్తున్నారని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడమే కాకుండా దళితులపై దాడులను అరికట్టాలని లేనిపక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిరసన దీక్షలు చేపట్టనున్నట్లుగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాలకు చెందిన నాయకులు జానకిరాములు, బాల మన్యం, మాసన్న, కురుమన్న ,దండు శ్రీను, వెంకటన్న ,కిషోర్ ,బోరెల్లి రాము తదితరులతో పాటుగా పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆత్మకూరులోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దళిత

## మృతుల కుటుంబాలను పరామర్శించిన చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, నవంబరు 03 ప్రభాతవార్త:**వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామానికి చెందిన కొమ్మగోని శివగౌడ్ ఇటీవల మృతి చెందాడు. అదే విధంగా పోచమ్మ గడ్డతాండకు చెందిన మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ వద్యవత్ బాలునాయక్ కుమారుడు పవన్ నాయక్ గత రెండు రోజుల క్రితం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుల కుటుంబాలను చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు కుటుంబాలను పరామర్శించి శివగౌడ్ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట వెంకటయ్యగౌడ్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

## మేకలు చోరీ... కేసు నమోదు...

**వెల్దండ, నవంబరు 03 ప్రభాతవార్త:** వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన బండ రాములు రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం 16 మేకలను దోడ్లో ఉంచగా అందులో 11 మేకలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకొనిపోవడంతో బండ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... బండ రాములుకు చెందిన 16 మేకలను తన దొడ్డిలో కట్టేసి ఆదివారం తెల్లవారుజామున వెళ్లి చూసే సరికి అందులో 11 మేకలు కనిపించకపోవడంతో చుట్టు ప్రక్కల వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకొనిపోయారని గ్రహించి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. చోరీ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయమందించిన వెంకటయ్యగౌడ్



ఆర్థిక సహాయం అందజేస్తున్న వెంకటయ్యగౌడ్

**వెల్దండ, నవంబరు 03 ప్రభాతవార్త:**మండల కేంద్రానికి చెందిన బొక్కల లింగయ్య, ఆలూరి జంగయ్యలు మృతి చెందారు. మృతుల కుటుంబాలను సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్యగౌడ్ వేర్వురుగా పరామర్శించి ఆయా కుటుంబ సభ్యులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, ఎండీ.రషీద్, గుద్దటి కిష్టాలు, శ్రీను, సాయిబాబు, యాదయ్య, రామస్వామి, మహేష్, భరత్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## భూత్పూర్‌లో ఘనంగా పోచమ్మ నూతన ఆలయ ముఖద్వార ప్రతిష్ఠాపన..

**భూత్పూర్,నవంబర్ 3,ప్రభాతవార్త :** ఎన్నో ఏళ్లుగా గుడి నిర్మాణానికి నోచని భూత్పూర్ పోచమ్మ దేవత నూతన ఆలయ నిర్మాణాన్ని ఆలయ ట్రస్టీ సత్తూర్ అశోక్‌గౌడ్ గ్రామస్తుల సహకారంతో పూర్తి చేశారు. ఆదివారం ఆలయానికి ముఖద్వార ప్రతిష్ఠాపన ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు.కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు బోరింగ్ నర్సింహులు,గడ్డం రాములు,సత్తూర్ సురేష్‌గౌడ్,వడ్ల బ్రహ్మయ్య,గొడుగు వెంకటరాజు,పులగుర్ల మల్లేష్,సత్తూర్ తిరుపతయ్యగౌడ్,గొడుగు చిన్ననారాయణ,అర్చకుడు మంజునాథస్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

# యువత స్వయం ఉపాధితో ఎదగాలి

**కార్యకర్తలు పార్టీతో పాటు వ్యాపారంలో ముందుండాలి**

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు : డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**పెబ్బేరు నవంబరు 03 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ కేంద్రంలో శ్రీ శ్రీనివాస ఆటోమొబైల్ కార్ స్పేర్ పార్ట్స్‌ను సందర్శించి నిర్వాహకులు పాతపల్లి చంద్రశేఖర్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అభినందించడం జరిగింది. రాజకీయాలతో పాటు వ్యాపార రంగంలో విజయవంతంగా ముందుకు నడవాలని ఆకాంక్షించడం జరిగింది. కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్, మాజీ పెబ్బేర్ మార్కెట్ యార్డు చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, శ్రీరంగపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్, రంపురం సహదేవుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు మన్యం, తోమాలపల్లి కృపాకర్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుగురు రాజశేఖర్ గౌడ్, వెంకటరత్నం నాయుడు, రాజు నాయక్, మార్కెట్ డైరెక్టర్ కృష్ణయ్య, తిప్పాయిపల్లి ఎల్లస్వామి నాయుడు, నవీన్ కుమార్ గౌడ్, బొట్టు శ్రీను ,పి అనిల్ ,నరేష్ జక్కుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారం ప్రారంభించిన కార్యకర్తను అభినందిస్తున్న జిల్లెల చిన్నారెడ్డి

# గొంతులో కోడిగుడ్డు ఇరుక్కుని వ్యక్తి మృతి

**లింగాల,నవంబరు 03 ప్రభాతవార్త :** గొంతులో ఉడకబెట్టిన కోడిగుడ్డు ఇరుక్కుని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన లింగాల మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం నంది వడ్డె మాన్ గ్రామానికి చెందిన ఉప్పరి తిరుపతయ్య (65) తన సొంత పనుల కోసం లింగాల మండ లానికి వచ్చాడు. తనకు ఆకలి వేయడంతో ఉడకబెట్టిన కోడిగుడ్లను తీసుకుని అప్పాయిపల్లి వెళ్ళే మార్గంలో కమాన్ దగ్గర కూర్చుని తింటున్న క్రమంలో గొంతులో గుడ్డు ఇరుక్కని ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుని భార్య లక్ష్మమ్మ గత 5 సంవత్సరాల క్రితం మృతి చెందింది. మృతునికి ముగ్గురు కుమారులు ఉన్నారు.



# క్రీడాకారులకు పూర్తి చేయూతనందిస్తాం

**మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి**

**మక్తల్,నవంబరు 03 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడలకు పుట్టినిల్లు లాంటి మక్తల్ ప్రాంతంలోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారు జాతీయస్థాయి క్రీడల్లో రాణించే విధంగా తయారు చేసేందుకు క్రీడకారులకు తన పూర్తి చేయూతనిందిస్తానని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి అన్నారు. ఈ నెల 4 నుండి 6 వరకు జనగామ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి రోడ్‌స్పీడ్ సైక్లింగ్ పోటీలలో జిల్లా నుండి 48 మంది బాల బాలికలు పాల్గొనేందుకు ఆదివారం మక్తల్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ సంద ర్భంగా వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడా దుస్తులు, హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సైక్లింగ్ క్రీడాకారులు మక్తల్ పురవీధుల గుండా సైక్లింగ్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి వాకిటి లలిత, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం, కోళ్ల వెంకటేష్, పీడీలు, పీఈటీలు మీనాకుమారి, బి.రూప, సౌమ్య, రూప, సౌమ్య, స్వరూప, రేణుక, దామోదర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




క్రీడా దుస్తులు, హెల్మెట్లు అందజేస్తున్న దృశ్యం

# ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరండి

**మక్తల్,నవంబరు 03 ప్రభాతవార్త :** చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డిఏను చెల్లించడంతో పాటు పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మక్తల్ మండల అధ్యక్షులు బి. రవిందర్ పిలుపునిచ్చారు. ఆదివారం మక్తల్ పట్టణంలో నిర్వహించిన ఛలో నారాయణపేట సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్‌ని పూర్తిగా రద్దుచేసి ఓపిఎస్‌ని పునరుద్ధరించాలని, జిఓ 317 బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు నాగార్జున, తపస్ మండల గౌరవ అధ్యక్షులు నర్సిరెడ్డి, సంఘ సభ్యులు నరసింహులు, రవిందర్‌రెడ్డి, వెంకట్‌రాములు, రాజు, రామాంజనేయులు, జగదీష్, రవిందర్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బి. రవిందర్

# ఘనంగా వినియోగదారుల దినోత్సవం సదస్సు

**వనపర్తి రూరల్ నవంబరు 03 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆదివారం విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ప్రాంగణంలో వినియోగదారుల దినోత్సవం డివిజన్ ఇంజనీర్ ఏ. శ్రీనివాస్,ఓ.రాజశేఖరం ఎస్.ఈ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వినియోగదారులు వనగంటి నాగేశ్వర్ న్యాయవాది,గంధం నాగరాజు ఎస్.సి ఎస్.టీ నాయకులు, వీరపోగు శ్రీనివాస్, ఎర్ర శీను కాంట్రాక్టర్, తేనేటి ఆంజనేయులు రజక సంఘం ప్రతినిధులు, చిన్న ప్రెసిడెంట్ నాయి బ్రాహ్మణ ప్రతినిధులు, వ్యాపారస్తులు, పరిశ్రమల యజమానులు, వ్యవసాయ వినియోగదారులు పాల్గొనడం జరిగింది. అట్టి కార్యక్రమంలో పేరు మార్పిడి గురించి కొత్త మీటర్ల కొరకు, స్తంభాల మార్పిడి కొరకు,రోడ్డు విస్తరణలో రోడ్డు కాలువ లోపల ఉన్నటువంటి స్తంభాలను డ్రైనేజీ కాలువ రోడ్డు వైపు మార్చాలని కోరడం జరిగింది. అదేవిధంగా రజకులు, నాయి బ్రాహ్మణుల పాత బకాయిలు తీసివేయాలని,ఎస్టీలకు సంబంధించి పాత బకాయిలను మాఫీ గురించి అదేవిధంగా ఎస్సీ ఎస్టీ కాలనీలలో రిజిస్ట్రేషన్ లేని గృహాలకు కొత్త మీటర్లు ఇవ్వాలని కోరడం జరిగింది. వినియోగదారులు అడిగిన సమస్యలను అధికారులు వివరించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సదస్సులో డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ కే.రవీంద్ర మోహన్ అకౌంట్స్ ఆఫీసర్ నిసి మేడం బకాయిల విషయంలో వివరంగా అవగాహన కల్పించడం జరిగింది. సమావేశానికి హాజరైన విజయవంతం చేసినందుకు గృహ, వ్యాపారం, పరిశ్రమల,వ్యవసాయ, మీడియా మిత్రులకు, సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఇంజనీర్ కార్యాలయంలో వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

# బీసీ కమిషన్ పర్యటనను జయప్రదం చేయండి

**పెబ్బేరు నవంబరు 03 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 8వ తేదీన శుక్రవారం రోజు ఉదయం 10 గంటలకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు అభిప్రాయ సేకరణ ఉంటుంది. కనుక బీసీ నాయకులు బీసీలకు కావాల్సిన వివిధ అంశాలపై విజ్ఞప్తులు అందించాలని కోరుతున్నాం. బీసీలకు అన్యాయం జరుగుతే సహించేది లేదు నాలుగు శాతం ఉన్న జనాభా కు 10 శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థలలో బీసీల వాటా ఎంతో తేల్చాలి. బీసీల డిమాండ్లను బీసీ కమిషన్ సహకరించి ఈ డబ్ల్యూ ఎస్ తో పాటు కులగణన అనే అంశంపై తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీ కులాలు అప్రమత్తంగా ఉంటూ రాబోవు రోజులలో ఉద్యమించాల్సిన అవసరం ఎంతో ఉంది రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యల విడుదల చేసిన జీవో 18 కొంత ఆహ్వానించదగ్గ పరిణామం అని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసేదాకా అప్రమత్తంగా ఉండాలి. కులగణన చేసి స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన మాట ప్రకారంగా 42 శాతాన్ని కేటాయించి వారి నిబద్ధతను నిలబెట్టుకోవాలని ప్రభుత్వానికి వనపర్తి జిల్లా ఇన్చార్జి అధ్యక్షులు రామర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా యువజన అధ్యక్షులు బాలరాజు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య నాయకులు పరమేష్ నాయి, వడ్డె రమేష్, గోనెల బాలస్వామి,రాజు సాగర్, సుభాష్ సాగర్, హరి శంకర్ నాయుడు, బస్వరాజ్ గౌడ్, జనార్ధన్ నాయుడు తదితరులు పాల్గొని బీసీ కమిషన్ డిమాండ్ చేశారు.




ప్రెస్ మీట్‌లో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

# రైతు, కార్మిక సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి

**అమరచింత నవంబరు 03 ప్రభాతవార్త :** దేశంలో రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కృష్ణ, సిపిఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సిహెచ్ రామచందర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఏర్పాటు చేసిన సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు పూర్తిగా అప్పజెప్పడం జరుగుతుందని వారన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధిపై ఎలాంటి దృష్టి సారించకుండా దేశంలో మతోన్మాదం ప్రోత్సహిస్తుందని వారు విమర్శించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసిన ఇప్పటివరకు అమలు చేయడంలో విఫలమైందని ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని అలాగే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని రైతులకు భరోసా తో పాటు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్యకర్తలు కార్మికులు రైతులతో కలిసి ఉద్యమాల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు సూర్యం అరుణ్ కుమార్ ,హనుమంతు ,సామేలు, ప్రసాద్, రాజు ,కే రాజన్న, గణేష్ ,,సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.






అమరచింత మార్క్స్ భవనంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు కృష్ణ

# కోడి పుంజుల పందాలకు రాజకీయ గ్రహణం..

**వీపనగండ్ల నవంబరు 03 ప్రభాతవార్త :** కోడి పుంజుల పందాలు చట్ట వ్యతిరేకమైనప్పటికి గ్రామీణ ప్రాంతంలో పండుగల సందర్భంగా గత అనేక సంవత్సరాల నుండి ఆనవాయితీగా కోడి పుంజుల పందాలను ఆడుతూ ఉంటారు అయితే దీనికి వీపనగండ్ల లో గంగమ్మ పాముకాటు జాతర మూడు రోజులు ఇక్కడ కొనసాగుతుంది అయితే వాటిని నిర్వహించాలని అనుకున్న కోడిపందాల ఆటకు రాజకీయ గ్రహణం పులుముకొని చట్ట వ్యతిరేకమైనది అని పోలీసు అధికారులు బందు చేయించడం జరిగింది అయితే ప్రధానంగా గ్రామాలలో యువకులు కబడ్డీ క్రికెట్ ఎద్దుల బండలాగుడు చెక్క భజనలు కోలాటాలు పోటీలు తదితర ఆటల పోటీలు పెట్టి అందరినీ ఒక దగ్గర చేరుస్తూ అహ్లాదతో వాటిని పండుగల సందర్భంగా ప్రేక్షకులు వీక్షిస్తూ ఒకరిపై ఒకరు సంతోషాలను వ్యక్తం చేసుకుంటారు అలాంటిదే వీపనగండ్ల మండల దీపావళి గంగమ్మ పాము కాటు జాతర సందర్భంగా కోడిపుంజుల పందాల ఆట గత అనేక సంవత్సరాల నుండి జోరుగా ఇక్కడ కొనసాగుతూ ఉండేది అయితే ఇటీవల ఒక నాలుగైదు సంవత్సరాల నుండి చట్ట వ్యతిరేకమైనదని చెప్పి ఈ ఆటను పోలీసు వ్యవస్థ బందు చేయించడం జరి గింది. అయినా అక్కడక్కడ కొనసాగుతున్నప్పటికి పూర్తిగా ఆడకుం డా చేశారు. అయితే వీటి పైన వీపనగండ్లకు చెందిన నిర్వాహకులు ఎవరైతే ఉన్నారో గత నెల రోజుల నుండి గంగమ్మ పాముకాటు జాతర సందర్భంగా కోడిపందాల ఆటను నిర్వహించాలని అధికా రంలో ఉన్న ప్రజాప్రతినిధులను వారి సహకారం తీసుకున్నారు. వారు కూడా పోలీసు పై అధికారులతో మాట్లాడి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చట్ట వ్యతిరేకమైనటువంటి గొడవలు జరగకుండా కోడిపందాలు నిర్వహించడానికి అనుమతులు కోరారు. అయితే దానిపై పూర్తి స్థాయిలో అనుమతులు ఇవ్వకపోయినప్పటికి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకోవాలని అనధికారి కంగా సూచనలు కూడా నిర్వహకులకు అందాయి దానితో నిర్వాహకులు వివిధ ప్రాంతాల నుండి కోడిపందాల ఆటగాలను రప్పించుకోవడం జరిగింది. అయితే ఇక్కడ ప్రధానంగా ఈ గ్రామంలో కోడి పందాలు నిర్వహించడానికి సంతోషమైనటువంటి వాతావరణం సృష్టించేత అందుకోసమే తప్ప వేరే ఆలోచనలతో కాకుండా నిర్వహించాలని నిర్వాహకులు అనుకున్నారు. అయితే ఇది మొదటగా చట్ట వ్యతిరేకమైనటువంటి ఆట అని చెప్పి దీన్ని మంత్రికి వ్యతిరేకంగా ఈ ఆటలను ఎలాగైనా రద్దు చేయాలనేటటువంటి ఆలోచనలతో రాజకీయ ప్రతిపక్ష వ్యక్తులు పూనుకొని గ్రామంలో యువకులు ఆడుతున్న ఆటల పైన ఉన్న అభిమానాన్ని చూడకుండా రాజకీయంగా మంత్రిపైనే వ్యతిరేకంగా సృష్టించేటందుకోసం ప్రయత్నం చేశారు. ఈ విషయం కొద్దికొద్దిగా పెద్దగా రాష్ట్ర ఇంటలిజెన్స్ పోలీస్ వ్యవస్థ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయిలో వెళ్లడం జరిగింది. అయితే దీనిని ప్రభుత్వం సీరియస్ గా తీసుకొని దాని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది అనే దానితో పోలీస్ వ్యవస్థ కూడా కఠినంగా వ్యవహరిస్తూ దీపావళి పండుగ రోజు కోడిపుంజులు పందెం ఆటగాళ్లు ఎవరు వచ్చినా వారిని అరెస్టు చేయాలని తీవ్రంగా ప్రయత్నం చేసినట్లు తెలిసింది. దీనితో సదరు ప్రజాప్రతినిధి గ్రామాలలో ఎవరు కూడా చట్టం వ్యతిరేకమైనటువంటి ఇలాంటి ఆటలు ఆడ వద్దని చెప్పినట్లు తెలిసింది దారితో కోడి పందాల ఆటను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా కొన్ని చెడు అలవాట్లకు గ్రామీణ ప్రాంతంలో యువత లోన్ అవుతున్న విషయాన్ని ఎవరు పట్టించుకోరు కానీ ఎలాంటి గొడవలు లేకుండా తాము ప్రశాంతంగా ఆటలాడడానికి ప్రయత్నిస్తామంటే వాటిపై రాజకీయ నాయకుల ప్రమేయంతో ఇబ్బందులు పడవలసి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.



# ప్రారంభమైన నిత్య అన్నదాన సత్రం..

**కొత్తకోట నవంబరు 03 ప్రభాతవార్త :** అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతీయేడాది కార్తీకమాసం అయ్యప్ప దీక్షదారులకు ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమం ఆదివారం ప్రారంభం అయింది. కొత్తకోట పట్టణంలోని భూతనాథ అయ్యప్ప అన్నదాన క్షేత్రంలో అయ్యప్ప సేవాసమితి వ్యవస్థాపకులు గోపాలకృష్ణ గురుస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ యొక్క అన్న దాన కార్యక్రమం ఆదివారం నుండి జనవరి 14వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అయ్యప్ప దీక్షాదారులతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంతం నుండి శబరిమల యాత్రగా వెళ్లే పాదయాత్ర స్వాములకు, వాహనములలో వెళ్లే యాత్రికులకు తిరుగు ప్రయాణంలో స్వస్థలాలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గోపాలకృష్ణ తెలిపారు. ప్రతిరోజు దాదాపు 300 నుండి 500 మంది అయ్యప్పలకు అన్నదానం ఏర్పాటు చేయడం జరుగుతుందని భక్తులు అందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు ధూపం నాగరాజు మాట్లాడుతూ గత పదకొండెళ్ళుగా అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నామని ఎనిమిదేళ్ల పట్టణంలోని మార్కండేయ ఆలయంలో పూర్తి చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. యాత్రికుల సౌకర్యార్థం జాతీయ రహదారికి అనుకుని ఉన్న స్థలంలో ఆలయం ఏర్పాటు చేయాలనీ సంకల్పించి అక్కడే అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కార్తీక మాసంలో ఆలయ నిర్మాణ పనులను సైతం ప్రారంభిస్తామని తెలిపారు. ఆలయ నిర్మాణం కొరకు వనపర్తి గురుస్వామి దన్నాడ వెంకటేష్ రూ.1,50,000 విరాళం చెక్కును ఇచ్చారు. అన్నదాన ప్రారంభోత్సవ కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి ప్రధాన అర్చకులు నాటరాజ్ తో పాటు కమిటీ సభ్యులు బలిజ లింగేశ్వర్, పొగాకు అనీల్ కుమార్, విశ్వనాథం గంగాధర్, సత్యం సాగర్, గుంత కళ్యాణ్, వేముల సుధాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రవి కుమార్ రెడ్డి, కవీంధర్ రెడ్డి, ఉమా మహేశ్వర రెడ్డి, ఆకుల శ్రీనివాసులు, లక్ష్మీ నారాయణ, వారణాసి సతీష్ కుమార్, భీమ కిషోర్, భీమ చంద్రాకాంత్,బాదం వెంకటేష్, బాలస్వామి (కిరాణం) తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సభ్యులు

# బూత్‌కు 100కు పైగా సభ్యత్వాలు చేయిస్తే క్రియాశీల సభ్యత్వం

**బిజెపి మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ దోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి : దేవరకద్రలో బిజెపి సభ్యత్వ నమోదు సమావేశం**

**దేవరకద్ర,నవంబరు 03 ప్రభాతవార్త :** ప్రతి బూతుకు వందకు పైగా సభ్యత్వాలు నమోదు చేయించిన పార్టీ నాయకులకు పార్టీలో క్రియాశీలక సభ్యత్వం లభిస్తుందని బిజెపి మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ దోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. దేవరకద్రలోని పవన్‌కుమార్‌రెడ్డి ఇంట్లో ఆదివారం బిజెపి సభ్యత్వ నమోదు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బిజెపి దేవరకద్ర నియోజకవర్గ ఇంఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డితో కలిసి పవన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీలో ముమ్మరంగా సభ్యత్వ నమోదు చేయించిన వారికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి మొదటి ప్రాధాన్యతను పార్టీ ఇస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రతి బిజెపి నాయకుడు, కార్యకర్త గ్రహించాలన్నారు. బిజెపి దేవరకద్ర నియోజకవర్గ ఇంఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ప్రసంగిస్తూ ప్రతి బూత్‌లో 200 సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు. పార్టీ పటిష్టతకు అందరూ సమిష్టిగా పాటుపడదామన్నారు. కార్యక్రమంలో దేవరకద్ర మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజుతో పాటు సభ్యత్వ నమోదు ఇంఛార్జి నారాయణరెడ్డి, పార్టీ మండల పదాధికారులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఫోన్‌లో పార్టీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న దృశ్యం

# అపూర్వ కలయికతో ఆత్మీయ సమ్మేళనం..

**ఒకే వేదిక దగ్గర చేరుకున్న పూర్వ విద్యార్థులు**

**కోయిల్‌కొండ,నవంబరు 03 ప్రభాతవార్త :** నాటి బాల్య మిత్రులు ఒకేచోట చేరిన వేళ, ఆప్యాయతతో పలకరింపులు, క్షేమ సమాచారాల గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకోవడం, చిన్ననాటి బాల్యమిత్రులు ప్రభుత్వ ఉద్యోగాల్లో జీవనం గడుపుతూ ఇంకొంత మంది ప్రైవేట్ ఉద్యోగాల్లో రాణిస్తూ, మరికొంతమంది రాజకీయ రంగాలలో దూసుకుపోతూ ఒకే వేదిక దగ్గర కలుసుకున్న 1992,1993 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన మండలంలోని కొత్లాబాద్ జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలో సమావేశమై ఆత్మీయ సమ్మేళనం గావించారు. ఎన్నో సంవత్సరాల నుంచి విడిపోయిన పూర్వపు విద్యార్థులంతా ఒకే వేదిక దగ్గరకు చేరుకుని సంబరాలు జరుపుకున్నారు. తమకు విద్యనందించిన పూర్వపు ఉపాధ్యాయులకు పాదాభివందనం చేస్తూ పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. బాల్యంలో విద్యనభ్యసించిన విద్యార్థులంతా ఒకే వేదిక దగ్గర కలుసుకోవడంతో గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ చక్కటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పూర్వపు విద్యార్థులను అప్పటి ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వపు ఉపాధ్యాయులు నారాయణ, హరికృష్ణ, వి. శంకరయ్య, బాల్‌లింగం, రాజాలింగం, ఆంజనేయులు ఉన్నారు. ఇంతటి చక్కటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పూర్వ విద్యార్థులు డి.రాజిరెడ్డి, సురేష్, అన్నపూర్ణ, అరుణ, కృష్ణయ్య, విజయ్‌కుమార్, మారుతి, బాల్‌రెడ్డి, బుగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

# దశదినకర్మకు హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**కొత్తకోట నవంబరు 03 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణ కేంద్రంలోని ఫోటో జర్నలిస్ట్ యాదిరెడ్డి తండ్రి మొద్దు వేదాంతం రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆదివారం వారి నివాసంలో జరిగిన దశదినకర్మకు తెలంగాణ రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మంత్రి వెంట మాజీ జెడ్పివైస్ చైర్మన్ వామన్ గౌడ్, బిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, జిల్లా యూత్ నాయకులు శ్రీనుజీ, కానాయపల్లి మాజీ వార్డు సభ్యులు సాయిలు,కుర్మయ్య తదితరులు ఉన్నారు.



దశదిన కర్మకు హాజరైన మాజీ మంత్రి

# మేఘన్న అభయహస్తం ద్వారా ఆర్థికసాయం

**పెబ్బేరు నవంబరు 03 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన తెలుగు పద్మ అనారోగ్యంతో భాద పడుతూ చనిపోవడం జరిగింది. విషయాన్ని వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకుపోగా వారు స్పందించి విషయాన్ని వనపర్తి శాసనసభ్యులు నీయులు తూడి మేఘారెడ్డి కి తెలియపరుచగా వారి కుటుంబానికి తక్షణమే మేఘన్న అభయహస్తం ద్వారా 5000 అయిదు వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయవలసిందిగా ఆదేశించడం అయినది. ఈ ఆర్థిక సహాయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు టీ వీరస్వామి నాయుడు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాలెన్న, వెంకటేష్ ,ఈదన్న, గోపాల్ ,తెలుగు వెంకటయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.



నాయకులకు నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం..

**మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి**



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**మక్తల్,నవంబరు 03 ప్రభాతవార్త :** నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం వరం లాంటిదని, దీన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా మారాలని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం మక్తల్ పట్టణంలోని తన నివాసంలో పలువురు లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మక్తల్ మండలంలోని గుడిగండ్లకు చెందిన ఆశప్పకు రూ.22వేలు, కొత్త గార్లపల్లికి చెందిన లక్ష్మప్పకు రూ.46,500, జవలాపురం గ్రామానికి చెందిన చిన్న హనుమంతుకు సంబంధిత చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌మండల అధ్యక్షులు బి.గణేష్‌కుమార్, పట్టణఅధ్యక్షులు ఎ.రవికుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సిడిపి చైర్మన్‌ను కలిసిన మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామ్‌దేవ్‌రెడ్డి



**ఇటిక్యాల,నవంబరు 03 ప్రభాతవార్త :** సిడిపి చైర్మన్ పాపయ్య చంద్రశేఖర్‌రెడ్డిని ఆదివారం గోపాల్‌దిన్నె గ్రామానికి చెందిన అలంపూర్ మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రాందేవ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాందేవ్‌రెడ్డి చెరుకు రైతు సంఘం అధ్యక్షుడు పాపయ్య చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి జిల్లాలో చెరుకు పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలని అలాగే పంట అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని జోగులాంబ గద్వాల జిల్లాలో చెరుకు పంటలను పరిశీలించాలని కూడా కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రాందేవ్‌రెడ్డి తెలిపారు.

# ఆగిన హృదయాలు..

**మరణంలోని వీడని వృద్ధ దంపతుల బంధం**

**ఒకే రోజు వ్యవధిలో మృతి చెందిన వృద్ధ దంపతులు**

**దంపతుల మృతితో శోక సంద్రంలో బంధువులు, కుటుంబ సభ్యులు**


మృతి చెందిన దంపతులు (ఫైల్)

**వనపర్తి టౌన్ నవంబరు 03 ప్రభాతవార్త :** ఒకరినొకరు జీవితాంతం తోడుగా ఉంటామని భాసలు మానువాడిన వృద్ధ దంపతులు చివరికి మరణంలోను తోడుగా సాగారు. ఒక్కరోజు కూడా గడవక ముందే ఒకరి తర్వాత ఒకరు తనువు చాలించి మరణంలోనూ దాంపత్య బంధాన్ని చాటుకుని పలువురిని కంటతడి పెట్టించారు. శనివారం, ఆదివారం వెనువెంట జరిగిన హృదయ విదారక ఈ సంఘటనలు జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్‌లో చోటుచేసుకున్నాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన ఈరపోగు దావీదు (85), ఎస్తేరమ్మ (75) ఇద్దరు దంపతులు వివాహం జరిగిన నాటి నుంచి నేటి వరకు వనపర్తి పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటూ ఒకరంటే ఒకరు ఎంతో అన్యోన్యంగా జీవిస్తూ ఉండే వారు.దావీదు కు వృద్ధాప్యం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు తలెత్తడం వల్ల కుటుంబ సభ్యులు గత పది రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. వివాహం జరిగిన నాటి నుంచి ఒకరిని విడిచి ఒకరు ఉండలేని కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన భర్తను చూసిన ఎస్తేరమ్మ తన భర్తకు ఏమయిందో నన్న బెంగతో శనివారం సాయంకాలం7 గంటల సమయంలో గుండె ఆగిపోయి ఆసుపత్రిలోనే కూప్పకూలిపోయింది. ఎస్తేరమ్మ మృతదేహాన్ని ఇంటికి తరలించి సమాధి ఏర్పాటు చేసుకున్న కుటుంబ సభ్యులకు ఆదివారం ఉదయం పది గంటలకు గుండు బరువెక్కె మరో సమాచారం చెవిన పడింది. తన జీవిత భాగస్వామి తనపై బెంగతో తనువు చాలించిందన్న కటోర నిజంతో దావీదు కూడా ఆస్పత్రిలో కూప్పకూలిపోయాడు. ఈ సారి దావీదు మరణ వార్త కుటుంబ సభ్యులను. బంధుమిత్రులను శోక సంద్రంలోకి తోసేసింది. బ్రతికున్నన్నాళ్లు ఎంతో అన్యోన్యంగా ఒకరంటే ఒకరు ప్రేమతో మెలిగిన వృద్ధ దంపతులు ఒకరోజు గడవకముందే ఒకే సారి తనువు చాలించి ఒకరికొకరు తోడుగా సమాధికి సాగారు. ఎప్పుడు కనిపించినా తోడుగా ఇద్దరు కనిపించే దంపతులు చివరి అంకంలోనూ కలిసి సమాధి కావడం చూపరులను కలిసివేసి,కండతడి పెట్టించింది.

## మహసభ సదస్సును విజయవంతం చేద్దాం

**అయిజ,నవంబరు 03 ప్రభాతవార్త :** ఈనెల 7వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తలపెట్టిన మాదిగల ధర్మయుద్ధం మహాసదస్సు ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పోగుల రాజేష్ మాదిగ పేర్కొన్నారు. ఆదివారం మండలం కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం ఆవరణలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిజ మండల కేంద్రంతోత పాటుగా మండలంలోని అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కమిటీ సభ్యులు పాల్గొని ఈ సదస్సు ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ముప్పై ఏళ్ళ సుదర్ఘీ ఎమ్మార్పీఎస్ ఉద్యమ హక్కులను గౌరవించి ఎస్సీ మాదిగ ఉపకులాల ప్రజలకు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు తుది తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ పై స్పందిస్తూ, మొట్టమొదటగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎబిసిడి వర్గీకరణ ఫలాలను ఉద్యోగ రంగాలలో అవకాశం కల్పిస్తామని మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును ఎండగడుతూ. ఈ నెల 7వ తేదీన మహబూబ్‌నగర్ నిర్వహించబోయయే మాదిగల ధర్మ యుద్ధ మహాసభ సదస్సుకు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు ఆంజనేయులు మాదిగ, పులికల్ ప్రభాకర్ మాదిగ, హనుమంతు మాదిగ, బేడ బుడగ సంఘం జిల్లా అధ్యక్షులు అశ్వ మారెన్న, ఐజ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు మాదిగ, దేవరాజు మాదిగ, కళ్యాణ్, రామేష్ బాబు, సల్కాపురం గ్రామ యుదకులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**అడ్డాకుల,నవంబరు 03 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎస్ఎస్‌వి కాటన్ మిల్లులో సిసిఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సిసిఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి మిల్లులో పత్తిని అమ్ముకుని క్వింటాల్‌కు గిట్టుబాటు ధర రూ. 7,521 పొందాలన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు తోడుగా ఉంటుందన్నారు. అనంతరం మండల పరిధిలోని పొన్నకల్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు కె.నాగిరెడ్డి, డిసిసి జిల్లా కార్యవర్గ సభ్యులు గంగుల విజయమోహన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిపి దోనూరు నాగార్జునరెడ్డి, సిసిఐ అధికారులు, మండల ఏఈఓలు, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వేగనాథ్, సీనియర్ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**అడ్డాకుల,నవంబరు 03 ప్రభాతవార్త :** మండలపరిధిలోని రాచాలగ్రామంలో నిర్వహిస్తున్న 68ఎస్‌జిఎఫ్ అండర్ 17గర్ల్స్,అండర్ 19బాయ్స్ రాష్ట్రస్థాయి కబడ్డి పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు క్రీడాకారులు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించక 19 ఏళ్లు గడుస్తుందని, రాచాల గ్రామం అంటే నియోజకవర్గంలోనే క్రీడలకు ప్రసిద్ధి గాంచిందని, గత ప్రభుత్వంలో ఇదే గ్రామానికి చెందిన క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నప్పుడు ఈ గ్రామంలో క్రీడా పోటీలు నిర్వహించాలని క్రీడాభిమానులు విజ్ఞప్తి చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఈ పోటీల కోసం పలు జిల్లాలో పోటీ పడిన ముఖ్యంత్రి దేవరకద్ర నియోజకవర్గంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు నిర్ణ యం తీసుకున్నారన్నారు. అనంతరం టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించి, పోటీలను వీక్షించి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు కె.నాగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి, డిసిసి జిల్లా కార్యదర్శి రంగుల విజయమోహన్‌రెడ్డి, మండల ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంఈఓ కురుమూర్తి, స్థానిక మాజీ సర్పంచ్ పాశం తిరుపతయ్య, ఆర్గనైజింగ్ కమిటి బృందం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా**

## మీడియా వ్యవస్థ పనిచేయాలి:ఎస్పి యోగేష్ గౌతమ్

**నారాయణపేట టౌన్,నవంబరు 03 ప్రభాతవార్త :** ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా మీడియా వ్యవస్థ పని చేయాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసులు, జర్నలిస్టుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేశారు. మీడియా టీమ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. మ్యాచ్‌చివరలో ఎస్పీ బౌలింగ్ చేయగా డిపిఆర్ఓ రషీద్ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మీడియా టీమ్ 16 ఓవర్లలో 97 రన్స్ చేయగా పోలీస్ టీం 14 ఓవర్లలో 98 రన్స్ చేసి విజేతగా నిలిచారు. ఈ మ్యాచ్‌లో 41 రన్‌లు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన కృష్ణ ఎస్సై ఎంఎస్ నవీద్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందించారు. అనంతరం రెండు టీంలను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్, డిఎస్పీ ఎన్. లింగయ్య, ఆర్ఐ నరసింహ, సిఐ రామ్‌లాల్, ఎస్సైలు టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లా నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు రాజు, రఘు, అంబదాస్, సురేష్, శ్రీధర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**నారాయణపేట టౌన్,నవంబరు 03 ప్రభాతవార్త :** మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన శివరాజ్ అనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇటీవల మృతి చెందాడు. ఆదివారం మార్కెట్ కమిటి చైర్మన్ సదాశివరెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాన్ని సందర్శించి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనం ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేట నుండి శ్రీశైలానికి

## బస్సు ప్రారంభించిన నాయకులు

**నారాయణపేట టౌన్,నవంబరు 03 ప్రభాతవార్త :** నారాయణపేట డిపో నుండి శ్రీశైలానికి ఆదివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనసూయ, వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ శివారెడ్డి, బస్ డిపో మేనేజర్ లావణ్యలు శ్రీశైలానికి బస్సు ప్రారంభించారు. అనంతరం డిపో మేనేజర్ లావణ్య మాట్లాడుతూ నారాయణపేట బస్టాండ్ నుండి రోజు ఉదయం 8.20 ని.లకు బయలుదేరి శ్రీశైలానికి మధ్యాహ్నం 3 గం.లకు చేరుతుంది. తిరిగి అక్కడి నుండి నారాయణపేటకు ప్రతిరోజు మధ్యాహ్నం 3.30 గం.లకు బయలుదేరుతుంది. ఎమ్మెల్యే చొరవతో శ్రీశైలానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంల మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ కొనంగేరి హన్మంతు, కౌన్సిలర్ సలీం, మార్కెట్ డైరెక్టర్ శరణప్ప, గండె చంద్రకాంత్, చిట్టెం మాధవరెడ్డి, జి. రఘువీర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మారుతి, ధన్వాడ వెంకట్రాములు, కార్తీక్, నూకల్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

# జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**చిన్నచింతకుంట,నవంబరు03 ప్రభాతవార్త:** శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. స్వామివారి పుష్కరిణి పక్కన నిర్మిస్తున్న మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. స్వామివారి కోనేరులో ఎప్పటికప్పుడు పరిశుభ్రమైన నీరును ఉంచాలని అధికారులను ఆదేశించారు. అన్నదాన సత్రం సమీపంలో నిర్మించిన షెడ్డును పరిశీలించారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బంతులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాతరలో స్వామివారి ప్రసాదంగా భావించే లడ్డు ప్రసాదం నాణ్యత లోపంగా ఉండడంపై టెండర్ దారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. లడ్డు ప్రసాదం నాణ్యతగా అమ్మాలని భక్తుల నుండి ఎలాంటి విమర్శ రాకుండా చూడాలని గుత్తేదారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట దేవస్థాన ఛైర్మన్ గౌని గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్లు సురేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**అధిక ధరలను కట్టడి చేయండి...**

శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు దేవాదాయ ధర్మదాయ నిర్ణయించిన ధరల కన్నా గుత్తేదారులు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. టెండర్ సమయంలో ఒక టెంకాయ, ఊదిబత్తిలు కలిపి రూ. 25లకు అమ్మాలి కాని టెంకాయ రెండు ఊదిబత్తిలు రెండు బంతి పూలు వేసి రూ. 30 లు వసూలు చేస్తున్నారు. అలాగే పూజా సామాగ్రి రూ. 30లకు అమ్మాల్సి ఉండగా దానిని రూ.50లకు భక్తులకు అమ్ముతున్నారు. దేవస్థాన కార్యాలయం కిందనే అధిక ధరలకు అమ్ముతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతరలో మిఠాయి దుకాణాలలో తక్కువ నాణ్యత గల నూనెలతో మిఠాయి పదార్థాలను తయారు చేసి భక్తులకు విక్రయిస్తున్నారు. దీని కారణంగా భక్తులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఎప్పటికప్పుడు దేవస్థాన అధికారులు, పాలక మండలి సభ్యులు మిఠాయి దుకాణాలలో నాణ్యమైన నూనెలతో మిఠాయిలను తయారు చేసేలా చూడాలని భక్తులు కోరుతున్నారు. సాధారణ భక్తులు ఉన్నప్పుడే అధిక ధరలకు అమ్ముతున్నారు. భక్తుల రద్దీ పెరిగేకొద్దీ మరింత అధిక ధరలకు అమ్మకాలు కొనసాగిస్తారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దేవస్థాన అధికారులు, పాలక మండలి సభ్యులు అధిక ధరలపై దృష్టి సారించి దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్ణయించిన ధరల మేరకు అమ్మకాలు కొనసాగించేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

# జిల్లా కలెక్టర్‌తో సమావేశమైన తహసీల్దార్‌ల అసోసియేషన్

**ఎట్టకేలకు తహసీల్దార్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు**

**ఇటిక్యాల,నవంబరు 03 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్‌తో ఇటిక్యాల తహసిల్దార్ నరెందర్ జిల్లాలోని తహసిల్దార్‌ల అసోసియేషన్ సమావేశమై ఇటిక్యాల తహసిల్దార్‌పై జరిగిన దాడి ఘటనను వివరిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి వారు తీసుకుపోయారు. జిల్లా కలెక్టర్ హామీతో ఎట్టకేలకు ఇటిక్యాల తహసిల్దార్ నరెందర్‌పై ఘర్షణకు దిగి దాడిచేసి దూషించిన వారిపై ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఇబ్రహీం, శేషన్న, చాకలి మద్దిలేటి, బోయ వెంకటన్న ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ వివరించారు. వివరాల్లోకి వెళ్తే మండల తహసిల్దార్‌గా పని చేస్తున్న నరెందర్ మునగాల గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారిగా ఉంటున్నాడు. అదే గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్న ఇద్దరిని తొలగించాలని వారు సక్రమంగా పని చేయడం లేదని నీటి ట్యాంకులు శుభ్రపరచడం లేదని బ్లీచింగ్ పౌడర్


కలెక్టర్‌తో సమావేశమైన తహసీల్దార్‌లు

కలపడం లేదని వారిని తొలగించాలని అదే గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి మరి కొంతమంది శుక్రవారం కార్యాలయానికి వచ్చి మల్టీపర్పస్ వర్కర్ల తొలగింపు గ్రామసభ విషయంపై తహసిల్దార్ నరెందర్‌తో కొంతసేపు మాట్లాడి వాగ్వాదానికి దిగి దూషిస్తూ ఆయనపై వాటర్ బాటిల్‌తో దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో తన విధులకు ఆటంకం కలిగించి దూషిస్తూ తనపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసు నమోదు చేయాలని వ్రాతపూర్వకంగా తహసిల్దార్ నరెందర్ అదేరోజు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్‌కు ఇచ్చారు. ఒకరోజు గడిచిన కేసు నమోదు చేయకపోవడంతో శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో ఇటిక్యాల తహసిల్దార్ నరెందర్ జిల్లాలోని ఆయా మండలాల తహసిల్దార్‌ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశమై దాడి ఘటనను వివరిస్తూ దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేయిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇటిక్యాల తహసిల్దార్ నరెందర్ ఫిర్యాదు మేరకు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్, నరెందర్ ఫిర్యాదే మేరకు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్, తహసిల్దార్ నరెందర్‌పై ఘర్షణకు దిగి దూషిస్తూ దాడి చేసిన మునగాల గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఇబ్రహీం, బోయ శేషన్న, చాకలి మద్దిలేటి, బోయ వెంకటన్న ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

# పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి

**నూతన ఉపాధ్యాయులకు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ. వెంకట్ సూచన**

**మహబూబ్‌నగర్,నవంబరు 03 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రతి ఉపాధ్యాయుని లక్ష్యం కావాలని, నాణ్యమైన విద్యనందించేందుకు నూతన ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎ. వెంకట్ పిలుపునిచ్చారు. డిఎస్‌సి 202 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు టిఎస్ యుటిఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎన్. వెంకటేష్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సర్వీస్ రూల్స్, లీవ్ రూల్స్‌పై ఆయన బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు మాత్రమే మిగిలారని, ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకుంటేనే అందరికి విద్య, ఉద్యోగం లక్ష్యం నెరవేరుతాయని అన్నారు. జిల్లా అధ్యక్షులు ఎన్. వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రవికుమార్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, హక్కులు, బాధ్యతలు ఉద్యమానికి రెండు నేత్రాలుగా పోరాడుతూ, సామాజిక స్పృహతో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి, శాస్త్రీయమైన విద్యనందించడానికి కృత నిశ్చయంతో పని చేస్తున్న ఏకైక సంఘం టీఎస్ యుటిఎఫ్ అని, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు నూతన ఉపాధ్యాయులు శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎస్. కిష్టయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.నర్సింలు, పి.ఉమాదేవి, జిల్లా కోశాధికారి వి. భాస్కర్, రాష్ట్ర కమిటి సభ్యులు వేణుగోపాల్, ఎం.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు హేమంత్‌కుమార్, శివరాజ్, వివిధ మండలాల బాధ్యులు జయంతి,రమేష్, అయూబ్ నూతన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్

## డైట్ ఛార్జీల పెంపు హర్షణీయం.. మరీ ఫీజు రియాంబర్స్‌మెంట్ సంగతేంది?

**పియు జేఏసీ ఛైర్మన్ బత్తిని రాము**

**మహబూబ్‌నగర్ బ్యూరో,నవంబరు 03 ప్రభాతవార్త :** మెస్ కాస్మొటిక్ చార్జీలు 40 శాతం మేర పెంచడం హర్షణీయమని పాలమూరు విశ్వ విద్యాలయ జేఏసీ ఛైర్మన్ బత్తిని రాము అన్నారు. ఆదివారం పాలమూరు విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని అనేక సంవత్సరాలుగా విద్యార్థులు పోరాటాలను నిర్వహిస్తున్నారు కానీ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు విద్యార్థులు గురవుతున్నారని చాలీచాలని డైట్, కాస్మొటిక్ బిల్లులు పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియాంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలాచోట్ల విద్యార్థులు పై చదువులకు, ఉద్యోగం కోసం వెళ్లే క్రమంలో సర్టిఫికట్లు లేక మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు పూర్తిస్థాయి ఫీజు రియాంబర్స్‌మెంట్ విడుదల అయితేనే సర్టిఫికెట్స్ ఇస్తున్నారని లేకపోతే విద్యార్థులే పూర్తిస్థాయి ఫీజులను చెల్లించి సర్టిఫికెట్స్ తీసుకువెల్లాలని షరతులు పెడుతున్నారని దీని ద్వారా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని అన్నారు. ప్రచారాల కోసం ప్రభుత్వం కోట్లలో ఖర్చు చేస్తున్న నిధులలో విద్యార్థులకు ఇవ్వడానికి ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ పియు అధ్యక్షుడు మీసాల గణేష్, శ్రీనుమాదిగ, జెఎసి నాయకులు కిందిగేరి వెంకట్, హరిచంద్ర, భాస్కర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బత్తిని రాము

# ఘనంగా పాముకాటు ఉత్సవాలు..

**జిల్లా, మండల స్థాయి, గ్రామీణ క్రీడల నిర్వహణ.. నాలుగు రోజులుగా కొనసాగిన గంగమ్మ దేవత ఉత్సవాలు**

**చిన్నంబావి,నవంబరు 03 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దదగడ, దగడపల్లి, అమ్మాయిపల్లి గ్రామాలలో దీపావళి పండగ సందర్భంగా పాముకాటు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పై మూడు గ్రామాలలో గంగమ్మ తల్లి గుడిలో అమావాస్య రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి, గౌరీనోములు అనంతరం ఆయా గ్రామాలలో గంగమ్మ భక్తులు నోములు నిర్వహించుకుని ఏకాంతంగా గంగమ్మ గుడిలోనే నిద్రించడంతో గంగమ్మ తల్లి పాము గుడిలో ఉన్న పాలను తాగి ఆ భక్తుని కాటు వేయడం జరుగుతుంది. అనంతరం అతడు పాముకాటుకు గురైనట్లు నిర్ధారించి రెండు రోజులుగా భక్తితో భక్తులకు భవిష్యవాణి సైతం తెలియజేస్తారు. ఇలా పై మూడు గ్రామాలలో దీపావళి సందర్భంగా పాముకాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. పండగను పుర్కస్కరించుకుని గ్రామంలోని ఆడపడుచులు బంధుమిత్రులు పెద్ద ఎత్తున గ్రామానికి విచ్చేసి పండగను జరుపుకునే ఆనవాయితీ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తుంది. పై మూడు గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుంది. మూడు గ్రామాల దేవతలకు వెలుగొండ గ్రామంలోని మహాదేవయ్య గుట్టపైన వెలసిన గంగమ్మ దేవతకు ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో ఎడ్లబండ్లపై ఊరేగింపుగా బయలుదేరి మొక్కుబడి చెల్లించుకుంటారు. వీరశైవంలో బసవేశ్వరుని ఆరాధించిన పండితారాధ్యుని యొక్క ముగ్గురు శిష్యుల్లో బెక్కెం మఠం శాంతి రామయ్య అలియాస్ మఠం రామయ్య, మియాపూర్ గ్రామంలో కాళికామాతను ప్రతిష్టించిన సత్యమ్మ, వెలుగొండ గ్రామంలో గంగమ్మ దేవతను ప్రతిష్టించిన మహాదేవయ్యలు ఈ ప్రాంతంలో శివతత్వాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. అలాగే గ్రామ యువత, గ్రామ కమిటి ఆధ్వర్యంలో ఎడ్ల బండలాగుడు పోటీలు, క్రికెట్ టోర్నమెంట్, ఎడ్ల ప్రదర్శన, గుండ్లు ఎత్తడం లాంటి క్రీడలు ప్రసిద్ధి చెందాయి. ఆదివారంతో గంగమ్మ తల్లి ఉత్సవాలు ముగిశాయి.కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతు కమిటీ సభ్యులు, గంగమ్మ దేవాలయ కమిటి సభ్యులు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు. పెద్దదగడ గ్రామంలో ఆదివారం పాముకాటు భక్తుడైన కనమోని గంగరాముడు భవిష్యవాణి వినిపించారు. గ్రామానికి చెందిన పోచమోని పెద్ద వెంకటస్వామి యాదవ్, రైతు ఎద్దులు గంగమ్మ దేవతను దర్శించుకున్నాయి. కార్యక్రమంలో మధుగం దర్గా యాదవ్, పోచమోని చంద్రశేఖర్ యాదవ్, మధుగం బాలరాజ్ యాదవ్, పోచమోని కురుమూర్తి యాదవ్ పాల్గొన్నారు.


ఎద్దులను ఊరేగిస్తున్న దృశ్యం


పాముకాటుకు గురైన గంగరాముడు

## గోనెల రాధాకృష్ణకు సన్మానం



**జడ్చర్ల,నవంబరు 03 ప్రభాతవార్త :** స్వరలహరి కల్చర్ అకాడమి పాలమూరు ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా సహస్రగళార్చన వెయ్యి మంది భక్తులతో సామూహిక పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్చర్లకు చెందిన సంస్కార భారతి సభ్యులు రాధాకృష్ణను శాలువా, మెమెంటోతో సన్మానించి ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటూ భక్తి భావన పెంపొందిస్తున్న రాదాకృష్ణకు స్వరలహరి కల్చర్ అకాడమి పాలమూరు అధ్యక్షుడు నాయన బాగన్నగౌడ్ ప్రశంసా పత్రం అందజేసి అభినందన తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో పల్లెర్ల రామ్మోహనరావు, ఆంజనేయులు, మేకల శ్రీను నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ లైన్లు పునరుద్ధరించాలని వినతి

**బిజినపల్లి,నవంబరు 03 ప్రభాతవార్త :** పాలెం నుండి ఖానాపూర్ గ్రామానికి గతంలో ఉన్న విద్యుత్ లైన్ పునరుద్ధరించాలని మాజీ సర్పంచ్ అతినారపు తిరుపతయ్య,మండల కిసాన్ సంఘ్ అధ్యక్షుడు మండల మధుబాబులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యుత్ సమస్యలున్న ప్రజలు ఫిర్యాదులు అందజేయాలని సూచించడంతో ఖానాపూర్ గ్రామస్తులు ఆదివారం జిల్లా విద్యుత్ శాఖ అధికారికి వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. ఖానాపూర్ నుంచి పాలెం వెళ్ళే ప్రధాన రహదారి వెంట ఉన్న విద్యుత్ లైన్లు గతంలో కురిసిన భారీ వర్షాలకు నేలకూలడంతో రెండు, మూడేళ్లుగా విద్యుత్ లైన్లు లేక రాత్రివేళ విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇక్కట్లుకు గురవుతున్నారని వివరించారు. గ్రామానికి రవాణా సౌకర్యం లేక రాత్రి సమయంలో నడుచుకుంటూ వచ్చేపాదచారులు విషస ర్పాలు,పురుగుల బారినపడే అవకాశం ఉన్నందున విద్యుత్‌లైన్లను పునరుద్దరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన విద్యుత్ శాఖఎస్ఈ వెంటనే మరమ్మతులు చేపట్టాలని మండల విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు.

## పేద వృద్ధులకు అన్నదానం

**చిన్నచింతకుంట,నవంబరు 03 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్న వడ్డెమాన్ గ్రామంలో ఆకలి బువ్వ సేవా సమితి వ్యవస్థాపకులు వడ్డెమాన్ రాజేంద్ర ఆధ్వర్యంలో పేద వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పేదలకు రోజుకోపూట అన్నదానం చేస్తామని రాజేంద్ర తెలిపారు. ప్రతిరోజు పది మంది పేదలకు శ్రేష్ఠమైన భోజనం పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వడ్డెమాన్ రాజేంద్రను గ్రామస్తులు, అతిథులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేసి నేను నిర్వహిస్తున్న ఆకలి బువ్వ సేవ సమితికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉమాపతి, మహ్మద్, ఎ. కృష్ణయ్య, యుగంధర్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్, ఎం.నాగరాజ్, సిరాజ్, అమరేష్, ఎం.ప్రవీణ్, నాగార్జున, సురేష్, ఈనాడు బాలరాజ్, యాకోబ్, మరాఠి శ్రీను, ప్రతాప్, ఎస్.శేఖర్, మెడికల్ వెంకటేష్, నర్సింహులుగౌడ్, హోటల్ శేఖర్, గౌస్‌లు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి

## పూర్వపు విద్యార్థి మల్లేష్ చేయూత

**లింగాల,నవంబరు 03 ప్రభాతవార్త :** పాఠశాల అభివృద్ధికి పాఠశాల పూర్వ విద్యార్థి మల్లేష్ చేయూత అందించడం ఆదర్శ నీయం. మండలంలోని జీలుగుపల్లి తండాకు చెందిన నాగమ్మ, వెంకటయ్య దంపతుల కుమారుడు దేవసోత్ మల్లేష్ తన చిన్నతనంలో చదువుకున్న పాఠశాలకు, అంగన్‌వాడి కేంద్రాలకు రూ.40 వేలతో గేటు దిమ్మలు, ర్యాంపు ఏర్పటు చేసి ఇనుప గేటును నిర్మాణం చేయించాడు. అనంతరం పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ దేవసోత్ మల్లేష్ తన తల్లి అంగన్‌వాడిలో ఆయాగా పని చేసిన సందర్భంగా నాగమ్మ జ్ఞాపకార్థంగా ఈ కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం గ్రామస్తులు బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ, దాత దేవసోత్ మల్లేష్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ కౌసల్య, మండల మహిళల సమాఖ్య కంప్యూటర్ ఆపరేటర్ ఆపరేట్ రవి, బుక్ కీపర్లు రాంబాబు, మమత, యువకులు శంకర్ రాథోడ్, రూపేష్, ఆంజనేయులు, అంజి, లక్ష్మణ్ పాల్గొన్నారు.


మల్లేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం